నాకే శాస్త్రి చేశావా?

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు

౧

సత్యవతి పిల్లవాడిని మంచంమీద పడుకోబెట్టి చిచ్చి కొట్టుతూ పడుక కుర్చీలో కూర్చున్న పెనిమిటి వంక జూచి, "పిల్లవాడు నిద్రబోయినాడు. లేచి కాళ్లు కడుక్కోండి వడ్డిస్తా" నన్నది.

"ఆకలికాలేదు"

"మళ్లీ క్లబ్బుకు వెళ్లివచ్చారూ."

"లేదు."

"లేకపోతే ఆక లెందుకు కాలేదూ? ఒంట్లో బాగుండలేదా?"

"మాస్నేహితు డొకడు తాలూకాబోర్డులో మెంబరైనాడు. అతనికి మాక్లబ్బుమిత్రు లందఱూ యివ్వాళ బాల్ చేశారు. దానికి వెళ్లాను."

"చందా యేమాత్ర మిచ్చారు."

"పదిరూపాయలు."

"అయ్యో, పదిరూపాయ లే! నాలుగుగాదు, అయిదుగాదు, పదిరూపాయలే యిచ్చారూ! మీకు యెన్నివిధాల విన్నవించుకున్నా మీపని మానరుగదా."

"అయితే ఏమిచేయమంటావు. క్లబ్బుమెంబర్లందఱూ యిస్తూంటే నేను యెట్లా ఊరుకునేది?"

"అవును, క్లబ్బులో ఉంటే యిటువంటి మొగమాటాలు ఉండేమాటే నిజము. ఆక్లబ్బుతో సంబంధమే వదులుకుంటే యీబాధ ఉండదుగా."

"క్లబ్బు మానడం నాచేత గాదు."

"అవును; ఆమెత్తని సోఫాలమీద, నిగనిగలాడే బల్లలముందు, విద్యుద్దీపాలు వెలుగుతుంటే, విసనకఱ్ఱలు విసురుతుంటే, వెండిప్లేట్లతో పలహారాలు, పమిడికప్పులతో పానీయాలూ, గాజుకోపాలతో సీమసారాయ

ములూ సేవించి కాసేపు ఆడిపాడి వస్తారు. అనుభవించేది పదినిముషాలే అయినా, నిజంగా అది దేవేంద్రభోగమే. ఆకాసేపు సుఖానికి అయ్యే కర్చంతో చూడండి. పళ్లు పోయినాయి, మాన్యాలు పోయినాయి. తోటలు పోయినాయి, దొడ్లు పోయినాయి. నగలు పోయినాయి, నాణ్యాలు పోయినాయి. మేడలు మిద్దెలు కూడా పోవడానికి సిద్ధమైనాయి. ఇంకా మీకు బుఱుకుపుట్టకపోయె. మోటారు దిగరాయె. క్లబ్బుమానరాయె. పైన ఓట్లగో లొకటాయె. వట్టి కోడిపుంజుల పోట్లాటేగాని ఆతాలూకాబోర్డుమెంబరైనంతమాత్రాన మనకు ఒరిగేదేమిటి? తలమునిగి తాటిప్రమాణంగా ఉన్న మనకు గొడవగూడా యెందుకు? ఓడితే పైకేడుపు, గెలిస్తే లోపలయేడుపు. అంతేగాని యీమెంబరుపనుల వల్ల అనుభవించే అధికారాలేమున్నాయి. పైగా వాటికి క్లబ్బువిందులు, తోటవిందులు, ఇవోకర్చా? అయ్యో! పండువంటి సంసారాలు పాడైపోవటానికి వ్యాజ్యాలే ఉన్నాయనుకుంటే ఇప్పుడీ వోట్లుగూడా వాటికి తోడైనాయి. ఇదియేమి విలయమో! మనస్థితి మటుకు మనస్థితి ఆలోచించండి. ఎంతసంసారం ఎంతకు వచ్చిందో! మామగారు ఉండగా మనకాపుర మెట్లా ఉన్నది? ఇంటినిండా ధాన్యము! దొడ్డినిండా పశువులు! పెట్టెలనిండా ధనము! ఎటుచూచినా మహాలక్ష్మి తాండవమాడుతుండేది గదా. మామగారుమాత్రము దానము ధర్మము, అతిథి అభ్యాగతి, చుట్టము పక్కము అనకుండా ఉన్నారా? దేవతార్చన బ్రాహ్మణుడు, పురాణపు శాస్తుర్లుగారు, అధ్యయనపు పిల్లకాయలు, అతిథి అభ్యాగతి, చుట్టము పక్కము, జీతగాండ్లు కమతగాండ్లు! ఎంతమంది! ఒకరా యిద్దరా? ఏపూటా పాతికమందికి తక్కువయ్యేవారుకారు. పైగా ద్వాదశి, పునర్వసు, జయంతి, బారసాల, అన్నప్రాశన, కేశఖండనము, వడుగు, పెండ్లి, యేదోనెపము, మూడుమూడు నాళ్లకు గ్రామసమారాధన, నిత్యకల్యాణం పచ్చ తోరణంగా

ఉండేది. ఆవిధంగా జరిగినా ఆయన హయాములో లేదన్న మాట వినలేదు. అటువంటికాపురానికి నేడు యెటువంటిపాట్లు వచ్చినాయి. పిడికెడు గింజలు బిక్షంపెడ్తే ఈపిడికెడు రాత్రికుండవేమో అనిపిస్తున్నది ప్రాణం. ఇదిగో యిటుచూడండి, మీపాదాలు ముట్టి చెప్పతున్నా; నామాటవిని ఆమోటారమ్మివేయండి. ఆక్లబ్బుకుపోవడం మానివేయండి. నూరురూపాయలాదా, పిల్లలు మనమూ కడుపునిండా తినవచ్చు. మీరు యేమిచేసిపెట్టమంటే అదిచేసిపెడ్తా. మీరూ పిల్లలూగూడా తినవచ్చు. ఎంత కాళ్లకు చుట్టుకొని యేడ్చినా ఆపసివెధవలకు కానీ మరమరాలు కొనడానికి కటకటలాడుతున్నా. మనకడుపు గట్టుకొని వాళ్లను పోషించాలంటారుగదా, వాళ్లకడుపు గొట్టి మనం తినడం న్యాయమా? ఏమి మాట్లాడరు? నామీదా బిడ్డలమీదా మీకు నెనరు లేదూ? నామనవి వినరూ." సత్యవతి పెనిమిటిపాదాలమీద పడి భోరున యేడ్చింది. మాధవరావుకుగూడా దుఃఖంవచ్చింది. కన్నీరు ఉత్తరీయపుకొంగుతో తుడుచుకున్నాడు కాని భార్య చెప్పిన హితవుమాత్రం ఆమోదించలేక పోయినాడు. మాధవరావు బస్తీకాపురం మొదలుపెట్టింది మొదలు అతనికి చాలాప్రియమైంది క్లబ్బే. మొత్తంమీద ఆతని కాపురం యింత దిగదీసింది క్లబ్బే. అయినా అతడు క్లబ్బుమీదివ్యామోహం వదులుకోలేక పోయినాడు. సత్యవతికిక యేమని సమాధానం? మాధవరావు నిరుత్తరుడైనాడు.

తాను యెన్నివిధాల చెప్పినా, ఎంత కనికరంగా విలపించినా ఆయనకు జాలిగలుగనందుకు సత్యవతికి మరీ దుఃఖం వచ్చింది. "ఏమి, క్లబ్బుకు వెళ్లడంమానరూ? ఆకటిచిచ్చుతో మలమలమాడే ఈ పిల్లలనూ నన్నూ చూస్తే మీకు దయలేదూ? క్లబ్బుకోసం భార్యాబిడ్డలను క్షోభపెడ్తారా?" అని యేడుస్తూ సత్యవతి పెనిమిటిపాదాల మీద మళ్లీ పడిపోయింది. మాధవరావు యిక నిబ్బరించుకోలేకపోయినాడు. అసలే హృదయ దౌర్బల్యంచేత హిస్టీరియవ్యాధితో పీడింపబడుచున్న తనభార్యకు మనస్సంక్షోభం పనికిరాదని డాక్టర్లు చెప్పినమాట అతనికి జ్ఞాపకం వచ్చింది. తాను క్లబ్బును వదిలానంటేగాని ఆమెకు మనశ్శాంతి కలుగదని అనుకున్నాడు. "సత్యవతీ! ఏడవబోకులే. ఇక క్లబ్బుకుపోనులే. ఏదో అలవాటు చొప్పున దానిని విడవలేక యేడవడమేగాని మనకాపురపుస్థితి నాకుమాత్రం తెలియదా? ఈమోటారుగూడా త్వరలో పోకడబెట్టాలెననే చూస్తున్నా" అన్నాడు. మాధవరావు పలికినపలుకులు సత్యవతి చెవులకు అమృతపుసోనలు వర్షించినట్లు అనిపించింది. మహాసంతోషం జెందింది. "క్లబ్బుకు పోరుగదా. పోరుగదా. అదే నాకు కావలసిం" దని ఆహ్లాదంగా పలికింది. "ఆ ఆర్తరక్షకుడు మీ కీమాత్రం మంచియోచన యిస్తే మనకాపురం మళ్లీ యెప్పటిలాగా కాదా" అన్నది. మఱి వివాదంలేకుండా రేయి గడిచిపోయింది.

౨

మఱునాడు నాలుగుగంటలైంది. మాధవరావు రాత్రి తనభార్యకిచ్చిన వాగ్దానంప్రకారం క్లబ్బుకు పోకుండా యింట్లోనే ఉన్నాడు. ఇంతలో డాక్టరు గోపాలస్వామినాయుడుగారి జవాను వచ్చి, "అయ్యా! డాక్టరుగారు తమరు క్లబ్బుకు వెళ్లేటప్పుడు తమయింటిమీదుగా దయచేయమనిచెప్పిరమ్మన్నారండీ" అన్నాడు. మాధవరావుకు యేమీ తోచలేదు. రాత్రి భార్యకు క్లబ్బుకు పోనని వాగ్దానంచేసి యీపూట పోవడానికీ అతని మనస్సు వెనుకదీసింది. క్లబ్బుపేరు తలుచుకుంటేను, అందులో ప్రియమిత్రుడు రమ్మని కబురుపంపితేను రాననడానికీ అతనిమనస్సు తల్లడించిపోయింది. కాసేపు నిస్తబ్ధుడై క్లబ్బుకు పోదాము పోదాము అని ఉరుకులుపెట్టే చిత్తాన్ని యెట్లో బిగపట్టుకొని మొఖం వాల్చుకొని, "నేనీదినం క్లబ్బుకురానని చెప్పు" అని చెప్పి పంపాడు. లోనుండి ఆమాటలు శ్రద్ధతో వినుచున్న సత్యవతి తనపెనిమిటి మనస్సు తిరిగిందని సంతోషంతో పొంగిపోయింది. కాని ఆమె సంతోషం యెంతోసేపు నిలుపలేదు భగవంతుడు. జవానుపోయి చెప్పగనే పాపము మాధవరావుగారికి యేమి అస్వస్థతగా ఉన్నదో క్లబ్బుకురానన్నారుట అని తానే కారు వేసుకొని చూడటానికి వచ్చాడు క్షణంలో డాక్టరునాయుడుగారు. నాయుడుగారు రాగానే 'రాండి రాండి' అని

ఎదురు బోయి చేయిబట్టుకొని కుర్చీలో కూర్చుండచేశాడు మాధవరావు.

"ఓహో! మీరు ఈదినం క్లబ్బుకు రానంటే ఏదో అస్వస్థతగా ఉన్నదని చూడడానికి వస్తే మీరు యెదురొక్కని స్వాగతాలిస్తున్నారే! అయితే క్లబ్బుకు యెందుకు రారు?" అన్నాడు డాక్టరు.

మాధవరావుకు యేమి చెప్పడానికీ తోచలేదు. క్లబ్బుకుపోకపోవడం తనకైనా మనస్ఫూర్తిగా హితకరమైన విషయం కాకపోవడంచేత ఏదో తడుముళ్లాడుతూ, "నెలనెలకూ క్లబ్బుకర్చు జాస్తీఅవుతున్నదండీ, అందుచేత" అన్నాడు. "హా! హా! హా! ఆదాలోపడ్డారు. ఏమిటి చెప్పరు? జనానావారి హుకుం గాబోలు" అన్నాడు నాయుడు. మాధవరావు మౌనం అర్ధాంగీకార మన్నట్టుగా నిరుత్తరుడైనాడు.

డాక్టరు గోపాలస్వామి నాయుడు అబ్కారీ డిపార్టుమెంటును పోషించడానికి పూనుకున్న మహాపురుషులలో ఒకడు. కాబట్టి భార్యామందలింపులు ఆతనికి నిత్యపాఠం. అందువల్లనే నిత్యం వేళతప్పకుండా క్లబ్బుకు హాజరయ్యే మాధవరావు క్లబ్బుకు రానన్నడానికి భార్యపోరే కారణమని ఆతని త్రాగుబోతుబుద్ధికి క్షణంలో తోచింది. కాబట్టి మాధవరావు మౌనం తన ఊహను బలపరచినందున "మన ఆడంగులగోలేకాని క్లబ్బుకు పోయినందువల్ల పోయేదేమున్నదండీ. కాశేపు ఖులాసా, కాశేపు ఆనందం, కాశేపుహాయి. ఈ వెధవకొంపలో ఉదయాస్తమానం కూర్చుంటే మనిషికి పిచ్చెత్తిపోదా. అందులో మావంటివాళ్లకైతే ఏమందు లియ్యడమో, ఏకేసులు చూడడమో ఉంటుంది గనక పోకపోయినా పొద్దుపోతుంది. మీరు యితర వ్యాపారమేమీ లేనివారు గూడాను, పొద్దుపోయేదెట్లా? శ్రోత్రియందారులే. మీరుగూడా యిట్లా క్లబ్బుకర్చులకు వెనుదీస్తే మన దేశంలో సొసైటీలు ఎట్లానిలుస్తాయి? రండి, క్లబ్బుకు పోదాము. సగం కర్చు నేనైనా భరిస్తా" నన్నాడు డాక్టరు.

మంచిదైనా చెడుదైనా ఒక సంఘంతోగాని ఒక మనిషితోగాని ఒక వ్యాపారంతోగాని పరిచయం కలుగచేసుకున్న తర్వాత దానితో శీఘ్రంగా సంబంధం వదులుకోడం మనిషికి సాధ్యమైన పనిగాదు. అందులో క్లబ్బులోని క్రీడా వినోదాలకూ ఆహారవిహారాలకు సాలీసుగా అలవాటుబడ్డ మాధవరావు, నాయుడు వంటి ప్రియస్నేహితుడు వచ్చి రమ్మని బలవంత పెడ్తుంటే రానన్నడానికి యెట్లా సాధ్యమౌతుంది. డాక్టరుగారికి యేమీ బదులుచెప్పకుండానే మెల్లగా పిల్లివలె వంటయింట్లోకి బోయి "యేమి డాక్టరుగారు క్లబ్బుకురమ్మని బలవంత పెడ్తున్నారు. ఒక్కమాటువెళ్లి క్షణంలోవస్తా" నన్నాడు. సత్యవతి యేమీ మాట్లాడలేదు. ఆమె విశాలనేత్రాలు కన్నీటితో తొణికిసలాడుతుండగా ఒక్కమాఱు భర్త వంక దీనంగా చూచి తలవంచుకుంది. ఆ సమయంలో సత్యవతిముఖాన ప్రతిబింబించిన విషాదచ్ఛాయలు ఆమె హృదయవేదనను వెల్లడించినవి. కాని మాధవరావు ఆమె ఉమ్మలికం గ్రహించలేదు. నేను క్లబ్బుకు పోతానన్నప్పుడల్లా నీముఖం యిట్లాగే మాడుతుంటుం దన్నట్టుగా అసహ్యభావంతో ఆమెవంక చూచి నిర్లక్ష్యంగా డాక్టరుగారితో వెళ్లి కారు యెక్కాడు.

౩

దుర్వ్యసనలాలసులను లొంగదీయడానికి తల్లిదండ్రులు సమర్థులుగారు; ఉపాధ్యాయులు సమర్థులుగారు; భార్యలు సమర్థులుగారు; బంధుజనులు సమర్థులుగారు. దీనికి భగవద్దత్తమైన మహౌషధమొక్కటే. అది దారిద్ర్యము. ఔషధమునకు అనుపానం తోడు చేసినట్లుగా భగవంతు డొకప్పుడు యీదారిద్ర్యమునకు రోగమునుగూడ జోడుచేసి మింగిస్తుంటాడు యిట్టివారిచేత. ఇక నేమున్నది? ఈరెండు జోడైతే ఆటకట్టు. మాధవరావు ఒక్కమాఱుగా ఈఔషధానుపానములకు గురైనాడు. పగలు ఆహారనియమం, రాత్రులు నిద్రానియమం పాటించకుండా చెడతిని చెడతిరగడంచేత అజీర్ణవ్యాధి పట్టుకున్నది. సొమ్మంతా ఇచ్చవచ్చినట్టుగా వెచ్చబెట్టడంచేత చేతిలో చిల్లిగవ్వ లేదు. దుర్వ్యసనం, నిర్వ్యాపారం అంటే సామాన్యమా మరి? గొప్పగొప్ప సంస్థానాధిపుల సంస్థానాలు సైతము నిప్పచ్చరమైనాయి. ఇక మాధవరావు ఆస్తి నశించడ మొక లెక్కా? ఇప్పుడు

మాధవరావుకాపురము పశువులపాకలో. అదైనా ఋణదాతలు పిల్లలు గలవాడని అనుగ్రహించి యిచ్చినదే. కాపురం యెత్తుపడటంతోపాటు మాధవరావుగూడా యెత్తుబడ్డాడు. జబ్బుచేతా దిగులుచేతాగూడా అతను బయటికి పోవడంలేదు. దేహరుజ, మనోరుజ లేనివాడికి యింట్లో ఉన్నా ఆనందమే, బయటికిపోయినా ఆనందమే కాని, అన్నివిధాల క్రుంగిపోయినవాడికి సంతోషం యెక్కడినుంచి వస్తుంది? జరుగుబాటు తక్కువైన కొద్దీ చీకాకు యెక్కువైంది మాధవరావుకు. భార్యను చూస్తే అసహ్యము, బిడ్డలనుచూస్తే అసహ్యము. పాపం! తండ్రిని చూడగానే భయంతో బల్లులవలె గోడకంటుకు పోతారు పిల్లలు. ఇట్లా ఉన్నా రోజూ యేదోనెపాన వాళ్లకు దెబ్బలుతప్పవు. ఇక సత్యవతి అగచాట్లకు అంతు లేదు. డబ్బులేకపోయినా,ఆరోగ్యంలేకపోయినా యిప్పటికీ దినుసుదినుసు తిండ్లమీదా అపేక్ష మాధవరావుకు. ఆకోరిక యేదోవిధంగా కొంచెమైనా తీరిననాడు ఒక మాదిరిగా ఉంటాడు. పూర్తిగా పూర్ణానుస్వారం ఆయేనా, ఆరోజున ఉన్నది సత్యవతి దురవస్థ. నరుడికి ఇతరుల తప్పును క్షమించడం కష్టంగాదు. వాళ్లయందు కనికరంగలిగో, తనకు పేరువస్తుందనో, క్షణంలో యితరుల లోపాలను క్షమిస్తాడు. కాబట్టి నిజమైన కష్టం తన తప్పును క్షమిరిచుకోడంలోనే ఉంది. ఇదిగో నేనీతప్పు చేశానంటే, పోనీలే అనడం, ఇదిగో నీవీతప్పుచేశావంటే మండి పడిపోవడం మనుష్యసామాన్యం. ఈ నైజం మాధవరావులో యిప్పుడుప్రకోపించింది. ఐశ్వర్యంతో తులతూగుతున్న కాపురాన్ని ఇంత నిప్పచ్చరంగా చేసింది తాననీ, తానేమీ సంపాదించకపోయినా కొంచెం మెలకువగా ప్రవర్తించినట్లయితే తనతరంలోనే గాకుండా తన పుత్రపౌత్రులతరంలో గూడా దారిద్ర్యాన్ని కళ్ల చూడవలసిన పనిలేదనీ మాధవరావుకు బాగా తెలుసు. ఈవేదనతో అతనికి నిశలుపవళ్లుగా వేగిపోతున్నాయి. కాబట్టే యితరులవల్లగూడా యీ వేదనాకరములైనమాటలు పడటానికి అతను సహించలేకుండా ఉన్నాడు. ఏమాత్రమైన చనువుగా మాట్లాడితే భార్యనోట యీమాటలువస్తాయేమోనని అతనికి భయం కనుక తానుచేసినలోపం కమ్ముకోడానికీ, తన్ను భార్య లాఘవంచేయకుండాఉండటానికే కాకుండా యిట్లాచేశాలేనని అడగటానికైనావీలుగాకుండాఉండటానికీ,యింకా యేమేమి ఊహలు మనస్సులో పెట్టుకొనో కసిబోక కారాడుతుంటాడు మాధవరావు సత్యవతిని. సత్యవతి మానవతి. ఏస్థితిలోనైనా భర్తమనస్సు నొప్పించడం ఆమె ఉద్దేశ్యంగాదు. నాభర్తకు మంచిబుద్ధిస్తే మంచిగా ఉండడా? ఇది దైవవిధి. కలిమినాడు అతనితో కాపురం చేసి లేమినాడు లేచిపోతాననడం సాధ్వీధర్మమా అని సత్యవతి ఆస్తి పోయీపోకుండా ఉన్నస్థితిలో పాడు చేయకండని వేడుకొనేదికాని, పూర్తిగా పోయినతరువాత పల్లెత్తలేదు. అతనికి జబ్బుకూడా చేసినతరువాత బొత్తిగా ఆతలంపే మానుకున్నది. కడచిపోయిన సంగతులు ప్రస్తావించి అతని మనస్సు కలంచినచో, అతని వ్యాధి ప్రబలమౌతుందని ఆమెకు భయం. బిడ్డలకైనా తనకైనా మానుకొని ఏదోవిధంగా పెనిమిటికి కావలసిన ఆహారపానీయాలూ, ఔషధాలూసమకూర్చి అతనిమనస్సు సంతృప్తిపరచి దేహమనోవ్యాధులనుండి అతనిని ముక్తి నొందించడమే ఆమెలక్ష్యం. ఈవిధంగా పతిని పరిచరిస్తూ "అఖిలదుఃఖరోగార్తుల కౌషధంబు ! భార్యయె చూవె" అన్న భారతమహావాక్యమును సార్థకం జేస్తున్నది సత్యవతి.

౪

పగలు మూడుగంటలు దాటింది. సత్యవతి అప్పటికప్పుడే పాలుప్రొయ్యిమీద నెచ్చబెట్టి కాఫీనీళ్లు వడగట్టుతున్నది. మాధవరావు అప్పుడే పగటినిద్రబోయి లేచి ఆవలించుకుంటూ ఒళ్లు విఱుచుకుంటూ వచ్చి 'వట్టి కాఫీనా' అన్నాడు.

"అయితే యేమి చేయను: ఉప్మా చేయనా ?"

"ఛూ; వద్దు."

"పోనీ దోసె వేయనా?"

"తగలెయ్, నేర్చావు వెధవపిండివంటలు?"

"అయితే ఏమిచేయమంటారు?"

"పకోడీలు."

"అమ్మో నెయ్యి లేదే."

"ఎప్పుడూ లేదన్నదేదీ."

"రాత్రికి పాటాపాటీగా సరిపొయ్యేటట్టున్నది. ఆకాస్తా యిప్పుడు కర్చుబెట్టుకుంటే యీరాత్రి యెట్లాగడుస్తుంది? ఇవ్వాళిటి కెట్లాగైనా కాఫీపుచ్చుకోండి; రేపు తప్పకుండా పకోడీలు చేస్తా."

"అయితే రేపే త్రాగుతాలే ఆకాఫీగూడా."

"అయితే యీచేసినకాఫీ యేమిచేయను?"

"నీముఖాన పోసుకో."

సత్యవతికి కళ్లనీళ్లు గిఱ్ఱున దిరిగాయి. అప్రయత్నంగా కొన్నిచుక్కలు నేలమీదగూడాబడ్డవి. మాధవరావు ఆకన్నీళ్లుచూచి మఱింతమండిపడుతూ "ఆయేడుస్తూయిచ్చేకాఫీ నాకక్కర్లేదు" అంటూ దబదబా షర్టతొడుక్కొని ఉత్తరీయం వేసుకొని యెక్కడికో వెళ్లిపోయినాడు. పెనిమిటి కోపంవచ్చి వెళ్లిపోవడంచూచి "కాఫీత్రాగి మఱీవెళ్లం" డని అడ్డఅడ్డాలువచ్చి బ్రతిమలాడింది సత్యవతి. కాని చేతితో ఆమెను ఒక్కత్రోపుతోసి వెళ్లిపోయినాడు మాధవరావు.

భార్యచేసిన వివిధోపచారాలచేత కాస్తరేకొన్నతరువాత మాధవరావు బజారుకువెళ్లడం యిదే మొదలు. పాపం! మాధవరావుజిహ్వ పసితనంనుండీ చవియైన తిండ్లకు అలవాటుపడ్డది. గఱగఱలాడేటట్లువేయించినచూరా గడ్డపెరుగూ దప్ప ఉడికినచూరా చిలికిన మజ్జిగా అతడు జిహ్వమీద పెట్టుకొని యెఱుగడు. కాఫీక్లబ్బుల్లో చిఱుతిండ్లు మరగిన తరువాత ఆతని జిహ్వాచాపల్యం మఱీ విస్తరించింది. మనుష్యులేయింద్రియచాపల్యమునైనా అరికట్టగలరు గాని జిహ్వేంద్రియచాపల్యంమాత్రం జయించలేరు. అందులో కొంతకాలం చెడతిన్నవాళ్లు మానుకోడమంటే అది మఱీ అసాధ్యమైన విషయం. కాబట్టి మాధవరావు రోగంతో దారిద్ర్యంతో క్రుంగిపోతూ మంచంలో లేవలేక పడిఉన్నా అతని చిత్తం క్లబ్బుల్లోని నానావిధ రుచ్యభక్ష్యాలల్లోను విహరిస్తుండేది. కనుకనే ఆతను నేడు భార్యమీద కోపంవచ్చి అడుగు పీథిలో పెట్టగానే సరాసరి నటేశయ్యరు లక్ష్మీవిలాస కాఫీక్లబ్బుకు నడిపించిం దతనిని చిత్తం. మాధవరావు సగం ముక్కలుఆస్తి యీక్లబ్బు యజమానికే చెందింది. మాధవరావువంటి శ్రీమంతులు అభిమానించబట్టే ముఱికిఖుంటుమాత్ర ద్వితీయుడై వచ్చిన నటేశయ్యరు యెలెక్ట్రిక్కు పంకాలతోనూ, వీవనలతోను, దీపాలతోను శోభాయమానంగా వెలిగిపొయ్యే ఒక గొప్ప కాఫీక్లబ్బుకు యజమానియై ఛేరైనా దిగకుండా శ్రీమంతులతో సల్లాపాలాడుతున్నాడు.

ꩥ

"నటేశయ్యరూ! నాకు యివ్వాళ మీక్లబ్బులో టిఫిన్ యిప్పించూ" అన్నాడు ప్రాధేయపూర్వకంగా మాధవరావు.

"డుడ్డు తెస్తివా."

"లేదు."

"డుడ్డు లేకపోతే టిఫిన్ యెట్లా వస్తుందయ్యా?"

"నీదయ, యెట్లా యిచ్చినా సరే."

"అయితే నాక్లబ్బులో నౌకరుగా ఉండు. రోజూ కాఫీ యిడ్లీ పకోడా బూందీ మస్తుగా యిస్తును."

మాధవరావువద్ద వందలువందలకు బిల్లు చేసి ఆతనికొంప దోచేసిన అయ్యరు మాధవరావుకుచేసిన సత్కార మిద్ది. నిజంగా పౌరుషశాలియైన మగవాడికి యింతకంటే అవమానకరమైన సంగతి యింకొకటి లేదు. కాని వివిధ దుర్వ్యసనాలచేత మనుష్యత్వం చచ్చిపోయిన మాధవరావు కీమాటలలోనున్న అవమానం ద్యోతకంకాలేదు. పైగా తనకు కాఫీ ఫలహారం యివ్వకుండా తిప్పలుబెట్టుతున్న భార్య కిది తగినశాస్తి అనుకున్నాడు. "అట్లాగే చేస్తాను అయ్యరూ" అన్నాడు. మాధవరావు తెలివిమాలినతనానికి తాంబూలపుగార పట్టిన పండ్లు కనపడేటట్టుగా ఒక్కవికృతపునవ్వు నవ్వి అయ్యరు "అయితే రేపు ప్రొద్దుటినుంచీ నౌకరీకి రా" అని, "అరే పయ్యాన్, ఒక కాల్ శేరు పకోడా, ఒక కప్పు కాఫీ యీయన కియ్యి"మని నౌకరుకు ఉత్తరువుచేశాడు అయ్యరు.

మాధవరావు బ్రహ్మానందభరితుడైనాడు. లక్ష్మీవిలాసక్లబ్బులోని ఘాటుకాఫీ, కమ్మనిపకోడీ రుచి చూచి సంవత్సరమైంది మాధవరావుకు. కనుక నౌకరీ పిల్లవాడు తెచ్చిన కాఫీపకోడీలు క్షణంలో మటుమాయంచేసి తృప్తిదీరక పదార్థాలవంకా పయ్యాన్‌వంకా గుటకలుమ్రింగుతూ చూచాడు. కాని ప్రయోజనమేమున్నదీ? మొదట అయ్యారువారి శాంక్షన్ ఎంతో అంతే.

౬

కడచిన దినం మొగుడు కోపంచేత కాఫీ త్రాగకుండా వెళ్లినందున యీపూట పెంపలకడనే కాఫీ పెసరట్లూ చేసిద్దామని రోజూకంటె ముందుగా లేచి సత్యవతి అదేప్రయత్నం చేస్తున్నది. ఆరోజు నటేశయ్యారు హోటల్లో నౌఖరీకి వస్తానని చెప్పివచ్చాడు గాన త్వరగా నిద్రలేచాడు మాధవరావు. రోజూ యెనిమిదిగంటలైనా లేపితేనేగాని నిద్రలేవని పెనిమిటి నాడు అంతప్రొద్దున్నే లేవడం, వేగంగా మొఖం కడుక్కోటం చూచి నేడుగూడా కాఫీ పుచ్చుకోకుండా వెళ్లుతాడేమోనని భయపడి, "కాఫీ దోసేగూడా తయారైంది; ఒక్కక్షణంలో యిస్తాను, ఎక్కడికీ పోబోకండీ" అన్నది సత్యవతి.

"నీ ముష్టికాఫీ నాకక్కర్లేదు."

"ఏదో ఉన్నకాఫీ యిస్తాను. ఇంతకంటె మంచి కాఫీ యెట్లా వస్తుంది?"

"నేను లక్ష్మీవిలాస్ క్లబులో పుచ్చుకుంటా."

"డబ్బు?"

"డబ్బు అక్కర్లేదు."

"డబ్బు లేకుండానే, ఊరికే యిస్తారా?"

"ఊరికే గాదు."

"కాక?"

"అక్కడ నౌకరీకి కుదిరా."

"ఆఁ ఆఁ, ఏమినౌకరీ?"

"కాఫీ హోటళ్లలో యేమి నౌకరీ లుంటాయో అదే."

"ఏమి, చిప్ప దొప్ప కడిగేనౌకరేనా?"

"ఆ. నీకు శాస్తిచేదామనే యీ నౌకరీకి ఒప్పుకున్నా."

కొట్లకు వోర్చింది. తిట్లకోర్చింది. పస్తులకోర్చింది. దరిద్రానికోర్చింది. యీఅవమానానికి ఓర్చడం దుస్సహమైపోయింది సత్యవతికి. "ఆఁ ఆఁ, పూలమ్మిన ఊళ్లో కట్టె........."మాట పూర్తిగాలేదు. అవమానంతో దుఃఖంతో గుండెలమీద చేయివేసుకొని వెనక్కు విఱుచుకొని పడ్డది సత్యవతి. మాధవరావు ఒళ్లు మండిపోయింది. "ఈహిస్టీరియరోగుల కిదోవేషం! ఏమాట విన్నా కొయ్యల్లె బిగుసుకుపోతారు." అని విసుక్కుంటూ కాలితో ఆమె నొకతాపు తన్ని ఆలస్యమైతే అయ్యారేమంటాడో అనుకుంటూ దొడ్లోకి పోయి చెంబుతో నీళ్లు దెచ్చి మొఖాన కొట్టాడు. తెలివి లేదు. పట్టిచూచాడు; దొర్లించాడు; పొర్లించాడు. ఏముందీ? పట్టెకొయ్య!

"అయ్యో! అయ్యో! సత్యవతీ! సత్యవతీ! నాకే శాస్తిచేశావా? నన్ను అభాగ్యుణ్ణి చేసిపోయినావా?" అని గుండెలు బాదుకుంటూ ఆకట్టెమీదపడి భోరుమన్నాడు మాధవరావు;—అతనితోబాటు పిల్లలు.